# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 10.04.2025 | 24 క్యారెట్లు 89,789.00 | కిలో వెండి 1,07,785.00 | 36°C | సంపుటి:3 | సంచిక:169

www.vishalabharati.com


# అమెరికా టారిఫ్‌లకు బ్రేక్
## అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం



- చైనా మినహా మిగిలిన దేశాలకు 90 రోజుల విరామం
- డ్రాగన్‌కు మాత్రం సుంకాలు 125 శాతానికి పెంపు, తక్షణం అమల్లోకి..
- యూఎస్‌పై 84 శాతం సుంకాలు: చైనా
- నేటినుంచే అమల్లోకి వస్తాయని ప్రకటన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అమెరికా ప్రతీకార సుంకాల బాదుడు నేపథ్యంలో ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్న దేశాలకు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని ట్రంప్ తీసుకున్నారు. తన సూచన మేరకు అమెరికాపై ఎలాంటి ప్రతీకార సుంకాలూ విధించని 75కుపైగా దేశాలకు.. సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ 90 రోజులూ ఆయా దేశాల ఉత్పత్తులపై నామమాత్రంగా 10 శాతం దిగుమతి సుంకాలను వసూలు చేస్తామని వెల్లడించారు. వాస్తవానికి ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలు బుధవారం ఉదయం నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. ట్రంప్ నిర్ణయంతో అది వాయిదా పడినట్టయింది. అదే సమయంలో.. ఢీ అంటే ఢీ అంటూ తమకు పోటీగా

..మిగతా 2 లో



# తగ్గనున్న ఈఎంఐల భారం
## గృహ రుణాలపై వడ్డీ తగ్గింపు

- ఆర్బీఐ ప్రకటనతో లక్షల్లో ఆదా
- రెపో రేటు 6 శాతానికి తగ్గించిన ఆర్బీఐ
- గోల్డ్ లోన్స్‌పై త్వరలో మార్గదర్శకాలు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

లోన్లు తీసుకునే వారికి ఊరట కలిగిస్తూ.. ఆర్బీఐ వరుసగా రెండోసారి కూడా కీలక రెపో రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో గతంలో 6.25 శాతంగా ఉన్న కీలక వడ్డీ రేట్లు ఇప్పుడు 6 శాతానికి చేరాయి. దీని వల్ల ఎక్కువగా రెపో రేటు లింక్ అయి ఉన్న గృహ రుణ వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం ఉంది. ఆర్బీఐ నిర్ణయంతో రుణాలు తీసుకున్న వారికి లాభం చేకూరుతుంది. వడ్డీ రేట్లు సంవత్సరానికి 8 శాతం కంటే తక్కువకు వచ్చే అవకాశం కూడా ఉంది. సాధారణంగా ఆర్బీఐ రెపో రేట్లు తగ్గిస్తే.. బ్యాంకులు వెంటనే లోన్ వడ్డీ రేట్లు తగ్గించాల్సి ఉంటుంది. అయితే.. రెపో రేటు తగ్గింపు ప్రయోజనాలను బ్యాంకులు వినియోగదారులకు పూర్తిగా

..మిగతా 2 లో

# బ్రిటిషర్ల కంటే బీజేపీ డేంజర్

- బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు చాలా ప్రమాదకరమైన వారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వాళ్లను తరిమి కొట్టినట్లే రాహుల్‌గాంధీ నాయకత్వంలో మనమంతా దేశంలో బీజేపీని ఓడించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ ఆలోచన విధానాన్ని కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ నేతృత్వంలో ముందుకు తీసుకుని వెళ్తుంటే.. ప్రధానమంత్రి మోదీ మాత్రం దేశ వ్యాప్తంగా గాడ్సే విధానాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అహ్మదాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సదస్సు 'న్యాయ్‌పథ్'లో బుధవారం సీఎం ప్రసంగించారు.



- వాళ్లను తరిమినట్లు ఆ పార్టీని తరిమేద్దాం
- తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనివ్వం
- గాడ్సే ఆలోచనల వ్యాప్తికి ప్రయత్నిస్తున్న మోదీ
- ఆయనపై వ్యతిరేకంగా రాహుల్ ఆధ్వర్యంలో పోరాడదాం
- పటేల్‌తో తెలంగాణకు స్వాతంత్ర్యం.. సోనియాతో రాష్ట్రం
- తెలంగాణలో కులగణన చేసి చూపించాం
- 25 లక్షల మందికి 21 వేల కోట్ల రుణమాఫీ చేశాం
- ఏఐసీసీ విస్తృత సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

'గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది. దేశ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు తెలంగాణకు రాలేదు. అప్పుడు మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వక బంధం ఉంది. వల్లభాయ్ పటేల్ మాకు స్వాతంత్ర్యం ఇస్తే..సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని అందించారు. వల్లభాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒకటే చెబుతున్నా. మేము బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం..అడ్డుకుంటాం. వారిని ఎవరూ క్షమించరు' అని రేవంత్ అన్నారు.

**మోదీ గ్యారంటీ దేశాన్ని విభజించడమే..**

'రాహుల్‌గాంధీ తెలంగాణలోని రైతులకు ఇచ్చిన హామీ మేరకు మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి 10 నెలల్లోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేసి చూపించింది. మరో హామీ అయిన కులగణనను కూడా పూర్తి చేశాం. కేంద్రం జనగణనతో పాటు కుల గణన చేయాలనే డిమాండ్‌పై లోక్‌సభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వకుండా రాహుల్‌గాంధీని మోదీ ప్రభుత్వం అడ్డుకుంది.

**2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ..?**

మరోవైపు ప్రధానమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని గాలికి వదిలేశారు. రెండు కోట్ల మందికి రాకపోయినా మోదీ, అమిత్‌షాలకు మాత్రం పదవులు వచ్చాయి. రైతులు కనీస మద్దతు ధర, నల్ల చట్టాలకు

..మిగతా 2 లో



# నేవీ అమ్ములపొదిలో రఫేల్ ఫైటర్లు

- రూ. 64 వేల కోట్లతో 26 యుద్ధ విమానాల కొను గోలు
- 1,600 కోట్లతో 'కృషి సించాయి' కింద ప్రత్యేక ఉప పథకం
- తిరుపతి–కాట్పాడి మధ్య రైల్వే డబ్లింగ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మోహరించేందుకు సుమారు రూ.64 వేల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్ నుం చి 26 నౌకాదళ వేరియంట్ల రఫేల్ ఫైటర్ జెట్‌ల కొనుగోలు ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో

..మిగతా 2 లో



# పాత వాహనాలకూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

- సెప్టెంబరు 30లోగా బిగించుకోవాల్సిందే
- లేదంటే బీమా సహా అన్ని సేవలూ బంద్
- కేసులు నమోదు చేస్తామన్న పోలీసులు

2 లో

# దేశమంతా తెలంగాణ ఫార్ములా

- 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని బద్దలు కొడతాం
- సమాజంలో 90 శాతం బలహీనవర్గాలు, పేదలే
- తెలంగాణ కులగణన సర్వేలో తేలిందిదే
- వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం
- ట్రంప్ టారిఫ్‌ఒత్తిళ్లకు మోదీ లొంగిపోయారు
- 56 అంగుళాల ఛాతీ ఎక్కడ?

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

తాము అధికారంలోకి వస్తే దేశంలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి బద్దలుకొడతామని, ఇందుకోసం తెలంగాణ ఫార్ములాను అమలు

..మిగతా 2 లో



# గ్రూప్1 మెరిట్ జాబితా రిలీజ్

- 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- నాంపల్లిలో ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో ప్రక్రియ

3 లో



# ఐపీఎల్‌లో గుజరాత్ దూకుడు

- వరుసగా నాలుగు విజయాలు
- చిత్తుచిత్తుగా ఓడిన రాజస్థాన్

..మిగతా 3 లో

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం
## నేడో రేపో ఉత్తర్వులు

- దానికి అనుగుణంగానే ఉద్యోగ నోటిఫికేషన్లు
- వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ
- 59 ఉపకులాలు.. మూడు గ్రూపులు.. 15 శాతం రిజర్వేషన్లు
- త్వరలోనే రాష్ట్రపతికి బీసీ రిజర్వేషన్ బిల్లులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు మార్గం సుగమమైంది. శాసనసభ, మండలి ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ సమ్మతి తెలిపారు. ఎస్సీల్లో ఉపకులాల్ని మూడు గ్రూపులుగా విభజించి 15 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ఈ బిల్లు రూపొందించారు. ఈ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు గవర్నర్‌కు ప్రభుత్వం పంపించింది. జిష్ణు దేవ్‌వర్మ మంగళవారం బిల్లుకు ఆమోదం తెలిపి, తిరిగి ప్రభుత్వానికి పంపించారు. బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించడంతో వర్గీకరణ అమలయ్యేలా ప్రభుత్వం త్వరలో



ఉత్తర్వులు జారీ చేయనుంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన ఎనిమిది నెలల్లోనే ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తూ.. 30 ఏళ్లుగా

..మిగతా 2 లో



# రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తోంది..

- రైతు బంధు, రుణమాఫీపై రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే..
- రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు పట్టించుకోవడం లేదు
- కేసీఆర్ రాష్ట్రాన్ని నిలబెడితే రేవంత్ పడగొట్టాడు
- మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు

3 లో

# బ్రిటిషర్ల కంటే బీజేపీ డేంజర్

వ్యతిరేకంగా 15 నెలలపాటు ఆందోళన చేసినా మోదీ ప్రభుత్వం కనీసం వారితో చర్చలు కూడా జరపలేదు. మోదీ మణిపూర్‌లో మంటలు రాజేశారు. దేశ మూల వాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం చేశారు. మోదీ గ్యారంటీ దేశాన్ని విభజించడమే. కానీ రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో పేరిట 150 రోజులు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు.

**బీజేపీ ఓటమికి కంకణబద్ధులై వెళ్లాలి**

దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ ఎన్నో ఆందోళనలు చేసినా.. ఆయనపై ఏనాడూ లాఠీ ఎత్తలేదు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన ఆరునెలల్లోనే గాడ్సేలు తూటాలు పేల్చి ఆయన్ను పొట్టన పెట్టుకున్నారు. గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని అడ్డుకునేందుకు, మోదీ ఆలోచన విధానాన్ని అడ్డుకునేందుకే మనమంతా ఇక్కడ ఏకమయ్యాం. ఇక్కడకు వచ్చిన ప్రతి నాయకుడు, కార్యకర్త రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రతిచోటా ఓడించేలా కంకణబద్ధులై వెళ్లాలి. గాడ్సే భావజాలాన్ని ప్రచారం చేస్తున్న ప్రధాని మోదీని, బీజేపీని అడ్డుకుని దేశాన్ని రక్షించాల్సిన అవసరం అందరిపైనా ఉంది..' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# అమెరికా టారిఫ్‌లకు బ్రేక్

తరువాయి భాగం



సుంకాలను విధిస్తున్న చైనాపై ట్రంప్ మరింత భారం మోపారు! అమెరికా తమపై సుంకాల భారాన్ని 104 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో.. చైనా కూడా అమెరికాపై సుంకాలను 84 శాతానికి పెంచుతున్నట్టు బుధవారం ప్రకటించింది. దీంతో అంకుల్‌శామ్ (అమెరికా అధ్యక్షుడు) మరింత రెచ్చిపోయారు. ప్రపంచ మార్కెట్ల పట్ల ఏమాత్రం మర్యాద చూపని డ్రాగన్ దేశంపై.. సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్టు తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్ ద్వారా ప్రకటించారు. మిగతా దేశాల్లాగా 90 రోజుల వెసులుబాటు కూడా ఇవ్వకుండా.. ఆ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ పోస్టులో ట్రంప్ తేల్చిచెప్పారు. అమెరికాను, ఇతర దేశాలను సుంకాల పేరుతో దోచుకోవడం ఇకపై ఎంతమాత్రం కుదరదనే నిజాన్ని చైనా త్వరలోనే తెలుసుకుంటుందన్న ఆశాభావాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు. అంతకుముందు.. అమెరికాపై 84 శాతం సుంకాలను విధిస్తూ తీసుకున్న నిర్ణయం గురువారం నుంచే అమల్లోకి వస్తుందని చైనా ప్రకటించింది. సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో అమెరికా మార్కెట్లు దూసుకుపోయాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ 8.5 శాతం పెరగ్గా.. డౌజోన్స్ సూచీ 7.2శాతం, నాస్‌డాక్ 10.8 శాతం మేర పెరిగాయి. 2020 నుంచి మార్కెట్లు ఒక్కరోజే ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. అంతేకాదు.. ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికాకు వ్యతిరేకంగా మరో దావా వేయబోతున్నట్టు వెల్లడించింది. చైనా కంపెనీలతో వ్యాపారం చేసే అమెరికన్ కంపెనీలపై మరిన్ని ఆంక్షలు విధిస్తున్నట్టు తెలిపింది. ఇప్పటికే ఇలా చాలా కంపెనీలపై ఆంక్షలు విధించిన చైనా.. తాజాగా 11 కంపెనీలను ఆ జాబితాలో చేర్చింది. సుంకాలను పెంచడం అమెరికా సమస్యలను పరిష్కరించదని చరిత్ర, గణాంకాలు చెబుతున్నాయని పేర్కొంది. అమెరికా చర్యలు ఆ దేశానికే ముప్పుగా పరిణమిస్తాయని హెచ్చరించింది. సుంకాల పేరుతో అమెరికా తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని.. కానీ, అలాంటి ఆధిపత్య చర్యలను తాము ఎన్నటికీ అంగీకరించబోమని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ స్పష్టం చేశారు. తమ దేశ సార్వభౌమాధికారానికి, భద్రతకు, అభివృద్ధి ఆకాంక్షలకు విఘాతం కలిగించే ఎటువంటి ప్రయత్నాలనూ తాము సహించబోమని.. అమెరికాపై దృఢమైన, శక్తిమంతమైన చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు. మరోవైపు.. యూరోపియన్ యూనియన్ దేశాలు సైతం అమెరికాపై 25 శాతం సుంకాల విధింపు ప్రతిపాదనకు అనుకూలంగా ఓటువేశాయి. ఈ సుంకాలు ఏప్రిల్ 15, మే 16, డిసెంబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్టు వెల్లడించింది.





# రైతులు పండించిన ప్రతీ గింజనూ కొంటాం...

- సన్నరకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం
- రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి
- రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది
- పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని రెడ్డి



**విశాలభారతి, పాలకుర్తి:**

రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని రెడ్డి సూచించారు. బుధవారం నాడు కొడకండ్ల మండలంలోని, రామేశ్వరం, రామవరం, కొడకండ్ల, పాకాల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సన్నరకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తున్నదని, రైతులకు ఏ ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రతి రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చివరి గింజ వరకు కొంటామని తెలిపారు. రైతులకు అవసరమైన, బస్తాలు. తాగునీటి సౌకర్యం, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవారికీ సన్న బియ్యం ఉచితంగా అందిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం మాటలకే పరిమితం అయ్యిందని.. కాంగ్రెస్‌ప్రభుత్వం చేతల ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**తొర్రూర్ మండలంలో..**

తొర్రూర్ మండలంలోని, వెల్లికట్టే గ్రామం , పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రతి రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చివరి గింజ వరకు కొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**రాయపర్తి మండలంలో..**

రాయపర్తి మండలంలోని, కోలన్ పల్లి, భురాన్ పల్లి, రాయపర్తి మండల కేంద్రాల్లో, ఐకేపీ, పీఏసీఎస్‌ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సన్నరకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ. 500 రూపాయల బోనస్ ఇస్తోందని.. రైతులకు ఏ ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తగ్గనున్న ఈఎంఐల భారం

తరువాయి భాగం

అందించడానికి వెనుకాడుతున్నాయి. కాబట్టి, ఆర్బీఐ నిర్ణయానికి ప్రధాన బ్యాంకులు ఎలా స్పందిస్తాయో చూడటం చాలా ముఖ్యం. ఒకవేళ బ్యాంకులు ఆర్బీఐ తగ్గింపునకు అనుగుణంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తే, అధిక వడ్డీ రేట్లతో బాధపడుతున్న గృహ రుణ గ్రహీతలకు ఇది చాలా ఊరటనిస్తుంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ ఇప్పటికే ఫిబ్రవరి నెలలో.. 25 బేసిస్ పాయింట్ల ప్రయోజనాన్ని తమ వినియోగదారులకు అందించినట్లు తెలిపాయి. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం, బ్యాంకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ రేట్లను సమీక్షించాలి. లోన్ ఒప్పందం ప్రకారం రేట్ల సర్దుబాటు సమయం మారవచ్చు. కొత్తగా రుణాలు తీసుకునే వారికి కూడా తక్కువ రేట్ల వల్ల లాభం చేకూరే అవకాశం ఉంది. ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్ తీసుకున్నా వారికి మాత్రం.. ఈఎంఐ లేదా లోన్ టెన్యూర్ తగ్గుతుంది. త్వరలోనే గోల్డ్ లోన్స్‌కు సంబంధించి ఆర్బీఐ మార్గదర్శకాలు విడుదల చేయనుంది.




# పాత వాహనాలకూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

- సెప్టెంబరు 30లోగా బిగించుకోవాల్సిందే
- లేదంటే బీమా సహా అన్ని సేవలూ బంద్
- కేసులు నమోదు చేస్తామన్న పోలీసులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పాత వాహనాన్ని ఉపయోగిస్తున్నారా? అది 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముందు తయారైందా? అయితే.. దానికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) బిగించుకోవాల్సిందే. ద్విచక్ర వాహనం నుంచి నాలుగు చక్రాల బండ్ల వరకు ఏవైనా సరే ఇకపై ఈ నంబర్ ప్లేట్‌ను తప్పనిసరిగా అమర్చుకోవాల్సిందే. దీనికి రవాణాశాఖ సెప్టెంబరు 30వ తేదీని గడువుగా నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వాహన రకాన్ని బట్టి నంబర్ ప్లేట్‌కు కనిష్ఠంగా రూ.320.. గరిష్ఠంగా రూ.800గా ఛార్జీలను ఖరారు చేసింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడం, దొంగతనాలను అరికట్టడం, వాహనాలు రహదారి భద్రత లక్ష్యంగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో రవాణాశాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి తయారైన వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ నంబర్ ప్లేట్ నిబంధన ఇప్పటికే అమలవుతోంది. ఇప్పుడు పాత వాహనాలకూ దీన్ని తప్పనిసరి చేశారు.

**యజమానిదే బాధ్యత**

పాత వాహనాలకు కొత్తనంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత వాహన యజమానిదే అని రవాణాశాఖ తెలిపింది. అది లేని వాహనాలను అమ్మాలన్నా.. కొనాలన్నా రవాణా కార్యాలయంలో పేరు మార్చుకోవడం సాధ్యం కాదు. వాహన బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి కూడా జారీ చేయరు. గడువు తర్వాత హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేస్తారు.

వాహన తయారీ సంస్థలు తమ డీలర్ల వద్ద హెచ్‌ఎస్‌ఆర్‌పీ బిగించే సదుపాయాన్ని కల్పించాలి. ఈ సమాచారం, నంబర్ ప్లేట్ ధరలు డీలర్ల దగ్గర కనిపించేలా ప్రదర్శించాలి. వాహనదారు ఇంటికే వెళ్లి నంబర్ ప్లేట్ బిగిస్తే అదనంగా రుసుం తీసుకోవచ్చు. వాహనదారులు ఈ ప్లేట్ కోసం www.siam.in వెబ్‌సైట్‌లో.. వాహన వివరాలు నమోదు చేసి బుక్ చేసుకోవాలి. కొత్త ప్లేట్ బిగించాక ఆ ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

# దేశమంతా తెలంగాణ ఫార్ములా

తరువాయి భాగం చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, మత సేచ్ఛపై దాడి అని అభివర్ణించారు. బీజేపీఆర్‌ఎస్‌ఎస్‌లు త్వరలోనే క్రిస్టియన్లు, సిక్కులు, ఇతర మైనారిటీల హక్కులపై పడతాయని వ్యాఖ్యానించారు. బుధవారం ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో రాహుల్ మాట్లాడారు. "నేను బలహీన వర్గాల వారి కోసం పనిచేస్తున్నాను. దేశ వనరుల్లో ఎవరి వాటా ఎంత అనేది తేలాల్సి ఉంది. అందుకు కులగణన చేయాలి. మేం తెలంగాణలో చేశాం. ఢిల్లీలో, దేశవ్యాప్తంగా కూడా చేసి చూపిస్తాం. రిజర్వేషన్లకు ఉన్న 50 శాతం పరిమితి అడ్డుగోడను బద్దలుకొడతాం. తెలంగాణలో చేసిన కులగణనలో సమాజంలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారని తేలింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. కానీ వారి గోడు పట్టించుకునేవారు లేరు. దేశవ్యాప్తంగా కులగణన చేపడితే ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది. నిర్ణయాధికారంలో వారి వాటా ఏమిటో వెల్లడవుతుంది" అని రాహుల్ చెప్పారు. టారిఫ్‌లపై ట్రంప్ ఒత్తిళ్లకు ప్రధాని మోదీ లొంగిపోయారని, దేశంలో ఆర్థిక తుఫాను రాబోతోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "56 అంగుళాల ఛాతీ ఎక్కడ పోయింది?" అని ప్రశ్నించారు. దేశంలో పది శాతం కార్పొరేట్ శక్తుల చేతుల్లో 90 శాతం సంపద పోగుపడిందని వ్యాఖ్యానించారు.



# నేవీ అమ్ములపొదిలో రఫేల్ ఫైటర్లు

తరువాయి భాగం

భద్రతపై కేబినెట్ కమిటీ(సిసిఎస్) ఆమోదముద్ర వేసినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత్, ఫ్రాన్స్ మధ్య అంతర్ ప్రభుత్వ యంత్రాంగం కింద కాంట్రాక్ట్‌పై సంతకాల అనంతరం సుమారు ఐదు సంవత్సరాల్లో జెట్ల సరఫరా మొదలవుతుంది. వరుస సంప్రదింపులు, ప్లాట్‌ఫారమ్ మదింపు పరీక్షల దరిమిలా 2023 జూలైలో రక్షణ మంత్రత్వశాఖ భారీ స్థాయిలో రఫాలె జెట్ల కొనుగోలుకు ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. ఆ ఒప్పందం కింద, భారతీయ నౌకాదళం రఫేల్(మెరైన్) జెట్ల ఉత్పత్తి సంస్థ దసాల్స్ ఏవియేషన్ నుంచి ఆయుధ వ్యవస్థలు, విడిభాగాలు సహా అనుబంధ పరికరాలను కూడా పొందుతుంది. భారతీయ వైమానిక దళం(ఐఎఎఫ్) గగనయానస్థితిలో 36 రఫాలె యుద్ధ విమానాలను కొనుగోలు చేసింది. కనీ సం మరి రెండు రఫేల్ జెట్ల స్క్వాడ్రన్‌లు కొనుగోలు చేయాలని కూడా ఐఎఎఫ్ యోచిస్తోంది. భారత్, ఫ్రాన్స్ మధ్య రక్షణ, వ్యూహాత్మక సంబంధాలు కొన్ని సంవత్సరాలుగా వృద్ధి చెందుతున్నాయి. భారత నౌకాదళం బలాన్ని మరింతపెంచేందుకు మూడు స్కార్పీన్ జలాంతర్గాముల కొనుగోలుకు కూడా రక్షణ మంత్రిత్వశాఖసుమారు రెండేళ్ల క్రితం ఒకప్రతిపాదనను ఆమోదించింది. సిసిఎస్ ఆ ప్రాజెక్టుకు ఇంకా ఆమోదముద్ర వేయలసి ఉంది.తిరుపతి,పాకాలకాట్పాడి మధ్య డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని కోసం రూ.1332 కోట్లు ఖర్చు కాగలదని అంచనా.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం

తరువాయి భాగం

వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి న్యాయం చేస్తూ ప్రక్రియ పూర్తి చేసింది. బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించడంతో ఇక నుంచి వెలువడే అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రకటనలు, విద్యా సంస్థల ప్రవేశాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు కానుంది.

**ఉపసంఘం.. ఏకసభ్య కమిషన్**

గతేడాది ఆగస్టు 1న వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వర్గీకరణ అమలు చేస్తామంటూ ఆ రోజే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. 2024 సెప్టెంబరు 12న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని సైతం నియమించారు. విస్తృతస్థాయి సంప్రదింపుల అనంతరం వర్గీకరణపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను నియమించాలని ఉపసంఘం సిఫార్సు చేసింది. 2024 అక్టోబరు 11న ప్రభుత్వం



జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ విస్తృత అధ్యయనం చేసి ఈ ఏడాది ఫిబ్రవరి 3న ఉపసంఘానికి నివేదిక ఇచ్చింది. దానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలపగా... ప్రభుత్వం సంబంధిత బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టింది. దానికి అన్ని రాజకీయపార్టీలు మద్దతు తెలిపాయి.



# మాదగోని లక్ష్మమ్మకు నివాళులు

**టియుడబ్ల్యూజే-143 జిల్లా ఉపాధ్యక్షుడు పోలగోని లక్ష్మీకాంత్**

మునుగోడు,విశాలభారతి: మండలంలోని రత్తిపల్లి గ్రామానికి చెందిన నిజామాబాద్ SSR విద్యాసంస్థల అధినేత మాదగోని మారయ్య గౌడ్,మునుగోడు మండల నమస్తే తెలంగాణ విలేకరి మాదగోని బిక్షం గౌడ్ ల మాతృమూర్తి మాదగోని లక్ష్మమ్మ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న టియుడబ్ల్యూజే143 జిల్లా ఉపాధ్యక్షుడు పోలగోని లక్ష్మీకాంత్ బుధవారం రత్తిపల్లి గ్రామంలో మాధగోని లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే143 మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోడి రాములు, టియుడబ్ల్యూజే143 మునుగోడు మండల అధ్యక్షుడు జీడిమడ్ల బాబు, టియుడబ్ల్యూజే143 నాయకులు నమస్తే తెలంగాణ చండూరు విలేకరి వరికుప్పల సురేష్, దుబ్బ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రూప్1 మెరిట్ జాబితా రిలీజ్

విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్రంలో గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలనకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) బుధవారం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 16, 17, 19, 21, 22 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5.30 గంటల వరకూ దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపింది. హైదరాబాద్‌లో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీలో అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలిస్తామని వెల్లడించింది. ధ్రువ పత్రాల వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం నుంచి టీజీపీఎస్సీ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచుతామని పేర్కొంది. అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 22 సాయంత్రం ఐదు గంటల వరకూ వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవచ్చునని తెలిపింది.

ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని టీజీపీఎస్సీ సూచించింది. నిర్ణీత తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరు కాని వారికి రిజర్వ్ డేగా 22 ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని వివరించింది. వెరిఫికేషన్ నాడు, రిజర్వ్ డే రోజు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురాకపోతే మళ్లీ అవకాశం ఇవ్వబోమని, ఇతర ఉద్యోగాల కోసం వారి పేర్లను పరిశీలించబోమని కూడా టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచిన అభ్యర్థుల్లో హాజరు కాకున్నా, తిరస్కరణకు గురైనా వారి తర్వాత ర్యాంకులు గల అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తామని వివరించింది.

# రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తోంది..



విశాలభారతి, స్టేట్ బ్యూరో: సంగారెడ్డి జిల్లాలోని రుద్రారంలో గల గణేష్ గడ్డ ఆలయంలో మాజీ మంత్రి హరీష్ రావు పూజలు నిర్వహించారు. పటాన్ చెరు బీఆర్ఎస్ నేత ఆదర్శ్ రెడ్డి పాదయాత్రకు మద్దతుగా పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తోంది.. ఏడాది కాంగ్రెస్ పాలనలో పాలేవో.. నీళ్ళేవో ప్రజలకు తెలిసిపోయింది అని మండిపడ్డారు. ఆనాడు LRS ఫ్రీ అని చెప్పి.. ఇప్పుడు ముక్కు పిండి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ అని ఫైర్ అయ్యారు. ఇక, రైతు బంధు, రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి చెప్పేవి అన్ని అబద్ధాలే.. అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎం భట్టిలకు రుణమాఫీపై సవాల్ విసిరితే ఉలుకులేదు, పలుకు లేదు అని హరీష్ రావు అన్నారు.

ఇక, కేసీఆర్ తెలంగాణను నిలబెడితే.. రేవంత్ రెడ్డి పడగొట్టాడు అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. దేశ సగటులో జీఎస్టీ తగ్గిందంటే దానికి కారణం రేవంత్ రెడ్డే.. కేసీఆర్ చెట్లు పెడితే...రేవంత్ రెడ్డి నరుకుతా అంటాడు.. ఇక, హైడ్రాతో పేదల ఇల్లు కూల్చాడు.. కేసీఆర్ ది సాగు బాషా అయితే రేవంత్ రెడ్డిది చావు బాషా అని మండిపడ్డాడు. రేవంత్ రెడ్డి పని ఢిల్లీలో కూడా అయిపోయింది.. బీసీల ధర్నాకు ఢిల్లీలోనే ఉన్న రాహుల్ గాంధీ ధర్నాకు రాలేదు.. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అగ్రనాయకత్వం పట్టించుకోవడం లేదని తేల్చి చెప్పాడు. HCU విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టిన రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. HCUలో అడవులు నరికిన రేవంత్ రెడ్డికి మూగ జీవాల ఉసురు తగులుతుంది అని హరీష్ రావు శాపనార్థాలు పెట్టాడు.

అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మంత్రులు కూడా వినడం లేదు అని బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ పాలన అంతా సగం సగం.. ఆగం ఆగం ఉందన్నారు. దేవుడినే మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బంగారు పళ్లెంలో పెట్టి తెలంగాణ రేవంత్ రెడ్డి చేతికి ఇస్తే అంత ఆగం చేస్తున్నాడు.. ఏడాదిలోనే లక్ష 50 వేల కోట్ల రూపాయల అప్పు చేశాడు.. రేవంత్ రెడ్డి వచ్చాక కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లకు రంగులు మాత్రం వేస్తున్నారు.. 10 ఏళ్లు దేశం మొత్తం తెలంగాణ వైపు చూసింది.. మళ్ళీ బీఆర్ఎస్ రావాలి, కేసీఆర్ కావాలి అని ప్రజలు కోరుకుంటున్నారు.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన 10కి 10 సీట్లు గెలిచి కేసీఆర్ కి గిఫ్ట్ ఇవ్వాలని హరీష్ రావు పిలుపునిచ్చారు.





# మహిపాలన్న పోతే బీఆర్ఎస్ మాయమైతదన్నరు..

- **కలిసి పని చేస్తున్నాం..పార్టీని కన్న బిడ్డలా కాపాడుకుంటున్నాం**
- **హరీషన్న నాయకత్వంలో పటాన్ చెరులో గులాబీ జెండా ఎగరేస్తాం**
- **బీఆర్ఎస్ పటాన్ చెరు కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి**
- **గణేష్ గడ్డ వరకు సింధు-ఆదర్శ్ రెడ్డి పాదయాత్ర**
- **పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు**

పటాన్ చెరు,విశాలభారతి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పుడు పటాన్ చెరులో బీఆర్ఎస్ మాయమైతదని అన్నారు..కానీ అలా జరగలేదని ఇప్పటికీ లీడర్లు, క్యాడర్ చెక్కుచెదరకుండా బీఆర్ఎస్ బలంగా ఉందని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి స్పష్టం చేశారు. నాయకులందరం కలిసి పని చేస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీని కన్న బిడ్డలా కంటి రెప్పలా కాపాడుకుంటున్నామని తెలిపారు.భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి మొక్కులో భాగంగా, ఆదర్శ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన సందర్భంగా బుధవారం రామచంద్రాపురం పరిధిలోని ఆదర్శ్ రెడ్డి స్వగృహం నుండి రుద్రారం గణేష్ గడ్డ ఆలయం వరకు కార్యకర్తలు, డివిజన్, నియోజకవర్గం ముఖ్య నాయకులతో సింధుఆదర్శ్ రెడ్డి దంపతులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గణేష్ గడ్డ ఆలయం వద్ద నిర్వహించిన సభకు మాజీ మంత్రి హరీష్ రావు అతిథిగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చసిన సభలో ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరితే బిఆర్ఎస్ పార్టీకి ఏమాత్రం నష్టం కాలేదన్నారు. బలమైన లీడర్లు ఉన్నారని, చెక్కు చెదరని క్యాడర్ ఉందన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు నాయకత్వంలో తామంతా కలిసిమెలిసి పనిచేస్తున్నామని, రాబోయే రోజుల్లో పటాన్ చెరు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతామన్నారు. బీఆర్ఎస్ 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్ లో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరించి తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేపల్లి సోమిరెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, వెంకటేశం గౌడ్, కుమార్ గౌడ్, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, షేక్రఫీక్, రాణి యాదవ్, బీఆర్ఎస్నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐపీఎల్‌లో గుజరాత్ దూకుడు

- **వరుసగా నాలుగు విజయాలు**
- **చిత్తుచిత్తుగా ఓడిన రాజస్థాన్**



విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఐపీఎల్ 2025లో గుజరాత్ వరుస విజయాలతో దూసుకెళ్తుంది. వరుసగా మూడు విజయాలతో జోరు మీదున్న గిల్ సేన.. బుధవారం (ఏప్రిల్ 9) రాజస్థాన్ రాయల్స్ పై భారీ విజయాన్ని అందుకుంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో 58 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ లో సాయి సుదర్శన్ (53 బంతుల్లో 82: 8 ఫోర్లు, 3 సిక్సర్లు) సత్తా చాటగా.. ఆ తర్వాత బౌలర్లు అద్భుతంగా రాణించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేజింగ్ లో రాజస్థాన్ 19.2 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది.

218 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ జైశ్వాల్ (6), నితీష్ రానా (1) సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యారు. ఈ దశలో కెప్టెన్ సంజు శాంసన్, రియాన్ పరాగ్ ఇన్నింగ్స్ ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పరాగ్ మూడు సిక్సర్లతో మంచి ఊపు మీద కనిపించాడు. పవరే ప్లే లో 57 పరుగులు చేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఉన్నంత సేపు సిక్సర్లతో హోరెత్తించిన పరాగ్.. కీపర్ (26) క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ తర్వాత వెంటనే ధృవ్ జురెల్ 5 పరుగులు చేసి పెవిలియన్ కు చేరాడు. దీంతో రాజస్థాన్ పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఒకవైపు వికెట్లు పడుతున్నా సంజు శాంసన్ యాంకర్ ఇన్నింగ్స్ ఆడాడు. హెట్ మేయర్ తో కలిస్ మెరుపులు మెరిపించాడు. మరో ఎండ్ లో హెట్ మేయర్ కూడా బౌండరీల వర్షం కురిపించడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. 41 పరుగులు చేసిన తర్వాత శాంసన్ ఔట్ కావడంతో మ్యాచ్ పై రాజస్థాన్ ఆశలు వదిలేసుకుంది. శాంసన్ ఔటైన తర్వాత హెట్ మేయర్ (32 బంతుల్లో 52) కాసేపు మెరుపులు మెరిపంచినా అతనికి సహకరించేవారు కరువయ్యారు. దీంతో రాజస్థాన్ కు ఓటమి తప్పలేదు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు. రషీద్ ఖాన్, సాయి కిషోర్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. ఖేజ్రోలియా, సిరాజ్, అర్షద్ ఖాన్ లకు తలో వికెట్ దక్కింది.

అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (53 బంతుల్లో 82: 8 ఫోర్లు, 3 సిక్సర్లు) భారీ హాఫ్ సెంచరీకి తోడు బట్లర్ (36), షారుఖ్ ఖాన్ (36) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ 82 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. రాజస్థాన్ బౌలర్లలో తుషార్ దేశ్ పాండే, తీక్షణ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. సందీప్ శర్మ, జోఫ్రా ఆర్చర్ తలో వికెట్ పడగొట్టారు.




విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
10.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
4
vishalabharathi Telugu Daily
GENERAL NEWS



## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డగూడూరు, విశాలభారతి:

మండలంలోని ధర్మారం గ్రామంలో ఇటీవలే అనారోగ్య అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుడు దౌపాటి మహేష్ కుటుంబానికి అండగామేమున్నామటూ ముందుకు వచ్చి స్నేహం అన్న మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు. అడ్డగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 200910, పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమవంతుగా మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించి రూ.30 వేల నగదును సేకరించి అందుబాటులో ఉన్న స్నేహితులు బుధవారం మృతుడి తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితులు మాట్లాడుతూ ఈ లోకంలో స్నేహానికి మించిన బంధం మరొకటిలేదని అందరితో మమేకమై కలివిడిగా కష్టసుఖాలను పాలుపంచుకునే ఆప్త మిత్రుడు దూరమవ్వడం చాలా బాధాకరమని భౌతికంగా మా మధ్య లేకపోయినా అతని భావాలు మాపై చూపించిన ఆధారాభిమానాలు ఏనాటికి చెరగని స్మృతులుగా మా మధ్య మెదలాడుతూనే ఉంటాయని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మిత్రుడు దౌపాటి మహేష్ కుటుంబానికి ఎల్లవేళలా తమవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి మల్లేష్, పయ్యావుల రమేష్, గూడెపు నరేష్, తాడోజు లక్ష్మణాచారి,కత్తుల నరేష్,చుక్క లోకేష్,తోట నగేష్, బాలెంల శంకర్, కప్పల మహేష్ పలువురు ఉన్నారు.




## జన వికాస ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

తొర్రూరు, విశాలభారతి:

బాలవికాస అనుబంధ సంస్థ అయిన జనవికాస ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని హరిపిరాల గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చలివెంద్రం ధాత, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తోట అశోక్ మాట్లాడుతూ వేసవికాలంలో బాటసారులకు దాహార్తిని తీర్చడానికి చాలివేంద్రాలు పెట్టించడం జరిగిందని అన్నారు. బాలవికాస సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ దేవేందర్,బాలవికాస మెయిన్ కోఆర్డినేటర్ ఎం. రమ,కారొబార్ బుచ్చిలింగం, వల్లపు రాఘువులు, సుధాకర్, రమేష్, రాము, బాలవికాశ మహిళలు, రేష్మ, సరిత, రమ్య, యమున,అర్చన, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన నాగం సుధాకర్ రెడ్డి

నూతనకల్, విశాలభారతి:

తుంగతుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే మందుల సామెల్ ఆదేశాల మేరకు ఎడవెల్లి గ్రామంలో 15 లక్షల రూపాయల సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందుల సామిల్ కృషితో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ దేయం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మరు ప్రసాద్ రావు ,గ్రామ శాఖ అధ్యక్షులు బయ్య గంగయ్య, గాజుల అశోక్ ,డిసిసి కార్యదర్శి గూగుల్ కృష్ణ నాయక్ ,మండల ఉపాధ్యక్షులు తోణుకునూరి సైదుల్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బంటు బద్రి, పాల్వాయి కార్తీక్ ,వెంకన్న ,పాల్వాయి పరశురాం ,దేవరకొండ సాయి ,మహేష్ ,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వేసవికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రభుత్వ వైద్యాధికారిణి దుర్గ భవాని

పినపాక, విశాలభారతి:



ఏప్రిల్, మే నెలల్లో ఎండలు విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున మండల ప్రజలందరూ వేసవి కాలపు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి దుర్గాభవాని తెలిపారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఉదయం సాయంత్రం వేళల్లో ప్రయాణాలు చేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, కొబ్బరి నీళ్లు, ఓ ఆర్ ఎస్ ద్రావణాలు, మజ్జిగ నీళ్లు పండ్ల రసాలు సేవించాలని, నల్లటి వస్తువులు శరీరంపై ధరించకుండా చూసుకోవాలని, ఎర్రటి ఎండలో వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున నీటి శాతం ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోగలిగితే ఆరోగ్యానికి చాలా శ్రేయస్కరం అని అన్నారు. పిల్లలు, వృద్ధులలో వేడిని తట్టుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది కావున వీరికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే మంచిది అని తెలిపారు. విపరీతంగా చెమటలు పట్టడం, వాంతులతో పాటు ఇతర లక్షణాలు కనిపిస్తే, పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువస్తే సరైన వైద్యాన్ని అందించి వడదెబ్బ తీవ్రతను తగ్గించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుకోవచ్చని ఆరోగ్య కేంద్రంలో అన్ని రకముల మందులు, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తొర్రూరు, విశాలభారతి:

అంగన్వాడి సేవలను గర్భిణీలు బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎసిడిపిఓ ఇందిరమ్మ అన్నారు. మండలంలోని ఖానాపురం గ్రామంలో పోషకాహారం పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు పౌష్టికరమైన ఆహారం అంగన్వాడీల ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. అంగన్వాడి సెంటర్లలోనే పౌష్టిక ఆహారం అందుతాయన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గౌసియా, అంగన్వాడి టీచర్, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, విశాలభారతి:



రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు మండలంలోని వెలికట్ట గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో గోనెసంచి టార్ఫ్లను అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం అమ్మి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలిపారు.ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320, సాధారణ రకానికి రూ.2300 అందిస్తుందని తెలిపారు. రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని,వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రూ.500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ,రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తొర్రూరులో గత యాసంగిలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1.13 లక్షల బస్తాలను కొనుగోలు చేసి రూ. 9.96 కోట్లు అందించిందని తెలిపారు. సన్నబియ్యం పథకం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. యువ వికాసం పథకం యువతకు ఎంతో ఉపయోగమన్నారు. త్వరలో సొంత ఇల్లు కల నెరవేరుతుందని అన్నారు. వడ్డీ లేని రుణాలు అందిస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. వెలికట్ట అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. దోనబండ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తొర్రూరులో మినీ బ్యాంకు ఏర్పాటుకు రూ.5 కోట్లు చేయించామన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్,ఏఎంసీ డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు పాపిరెడ్డి,టీకు నాయక్,వెంకన్న,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్,పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, మహిళ మండల నాయకురాలు మాలోత్ సునీత రాజేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువు

- బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం అధ్యక్షులు కుమ్మరి రాంబాబు

వాజేడు, విశాలభారతి:



వాజేడు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం అధ్యక్షులు కుమ్మరి రాంబాబు అన్నారు. బుధవారం బహుజన్ సమాజ్ పార్టీ మండల కమిటీతో ఆయన పాఠశాలలో గల సమస్యలపై ఆరా తీశారు. వాజేడు మండల పరిధిలో గల జగన్నాథపురం గ్రామంలో అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం లేక ఉపాధ్యాయులు పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు నెలలుగా జగన్నాథపురంపాఠశాలలో గల మంచినీటి బోరు పనిచేయ కుండ ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు గాని మండల అభివృద్ధి అధికారులు గాని పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. పాఠశాలలో 83 మంది విద్యార్థులు ఉండగా కేవలం రెండు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయని వాటికి నీటి సౌకర్యం లేక కాలకృత్యాల కోసం విద్యార్థులు బయటకు వెళ్లడం వలన పిచ్చికుక్కల బారిన పడిన సందర్భాలు ఉన్నాయని అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు తెలిపినట్లు పేర్కొన్నారు. 3 లక్షల కోట్లతో అసెంబ్లీలో బడ్జెట్ ప్రకటించి ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీల పిల్లలు చదువుకునే పాఠశాలలో మౌలిక వసతులు కల్పించకపోవడం ఏంటి అని దుయ్యబట్టారు. భద్రాచలం నియోజకవర్గం లో పనిచేస్తున్న ఎమ్మెల్యే కు ప్రజా సమస్యలపై ప్రభుత్వ రంగ వ్యవస్థలపై సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితులకు కారణం అన్నారు. ప్రజా సమస్యలను తీర్చలేని ఎమ్మెల్యే బే షరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి పాఠశాలలో సమస్యలను పరిష్కరించకపోతే బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనగం కేశవరావు, కార్యదర్శి సాధన పల్లి మోహన్ రావు, ఈసీ కుమ్మరి స్వర బాబు పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో రైతులకు అధిక ప్రాముఖ్యత

- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు

తుంగతుర్తి, విశాలాభారతి:

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో విద్యా వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డిసిఎంఎస్ డైరెక్టర్ తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఆదేశానుసారం మంగళవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.రైతులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద మాత్రమే ధాన్యం కొనుగోలు జరపాలన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న వడ్లకి క్వింటాల్ కి ఏ"గ్రేడ్ 2320రూపాయలను రైతులకు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సొసైటీ వైస్ చైర్మన్ మోడేమ్ శ్రీలత, డైరెక్టర్ బిక్షం రెడ్డి, సీఈఓ వందనపు వెంకటేశ్వర్లు, జై భీమ్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, గోపాలమిత్ర కుంచాల శ్రీనివాస్ రెడ్డి,అనుక్, ఏఈఓ సాయి సృజన, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- నల్గొండ ఆర్డిఓ అశోక్ రెడ్డి

శాలిగౌరారం, విశాలభారతి:

మండుతున్న ఎండలకు స్వచ్ఛంద సేవలు ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ఆర్డిఓ యానాల అశోక్ రెడ్డి కోరారు. బుధవారం శాలిగౌరారం లోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్ డి ఓ అశోక్ రెడ్డి ప్రారంభించారు. అశోక్ రెడ్డి మాట్లాడుతూ వివిధ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారని వారికి మండు వేసవిలో దాహర్తి తీర్చడానికి చలి వేంద్రకేంద్రాలు ఎంతో ఉపశమనం కలిగిస్తాయన్నారు. చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో శాలిగౌరారం తహసీల్దార్ పి. యాదగిరి, శాలిగౌరారం స్టేట్ బ్యాంక్ మేనేజర్ వై. శ్రీనివాసరావు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్యాంక్ మేనేజర్ జామ్లా నాయక్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సీఎం రెడ్డి,మారం వేణుగోపాల్ రెడ్డి,ప్రతినిధులు దునక వెంకన్న, రామడుగు వెంకట్రామశర్మ,శేఖర్ బాబు గుండ్ల రామ్మూర్తి, జోగు శ్రీనివాస్,దాచవరం జగదీష్ బాబు,బట్ట చిన సైదులు, కప్పల శ్రీకాంత్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొల్లికొండ గణేష్,నాయకులు బాకీ వెంకన్న, మాగి రవి, ఆర్ ఐ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

తిరుమలగిరి, విశాలభారతి:

సిపిఐ జాతీయ కమిటీ పిలుపుమేరకు తిరుమలగిరి మండల చౌరస్తాలో సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లంల యాదగిరి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి నాయకత్వంలో ఉన్న ప్రధాన మంత్రి మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు,అధిక ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు. ప్రస్తుతం గ్యాస్ మీద అదనంగా 50 రూపాయలు ధర పెంచిందని, అలాగే గ్యాస్,డీజిల్ ధరలు కూడా పెంచిందని తక్షణమే వాటి తగ్గించాలని అన్నారు. మోడీ ప్రభుత్వం పేదలపై ధరలు పెంచి కార్పొరేట్లకు ప్రభుత్వ ఆస్తులను కట్టబెడుతుందని అన్నారు. పెంచిన ధరలు దించే వరకు సిపిఐ పార్టీ నాయకత్వం ప్రభుత్వం పై పోరాటలు చేస్తామన్నారు. ఈ పోరాటంలో పేద మధ్యతరగతి ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా దేశంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశంలో శాంతి భద్రతలకు భంగము వాటిల్లే విధంగా చేస్తుందని అన్నారు. ఎదుర కాల్పుల పేరుతో బూటకపు ఎన్కౌంటరలను చేస్తుందని ఖండించారు. ప్రశ్నించే గొంతులను కోస్తుందని ,మార్చి 30 వ తారీకు వరకు ప్రజల కోసం,వారి హక్కుల కోసం పోరాడె మావోయిస్టులను అంతం చేస్తామని, విప్లవ కారులేని భారత దేశంగా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శబ్దము చేస్తున్నారని అన్నారు. ఇలాంటి బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటాలు చేయాలని ఈ పోరాటంలో ప్రజలంతా కలిసి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎస్ డి ఫయాజ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిపీరాల శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ఇక్బాల్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జంపాల మల్లయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు సట్టు నరసయ్య, కనుక అశోక్, ఎల్లంల సైదులు, ఎల్లంల కొమరయ్య,కుదురుపాక ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
10.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## జై బాపు జై భీమ్.. జై సంవిదన్

**వాజేడు, విశాలభారతి:**

మండల కేంద్రంలో ప్రాథమిక హక్కులపై జై బాపు జై భీమ్ జై సంవీధన్ భాగంగా జంగలపల్లి ఎస్టీ కలని ప్రజలకు రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కల్పించి కాంగ్రెస్ నాయకులు ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ..ప్రాథమిక హక్కులకు భిన్నంగా ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వము చేస్తున్న అరాచకాలకు ప్రజలంతా సంఘటితమై పోరాటం చెయ్యాలని హక్కులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్,ఖాజవాలి, తల్లడి ఆదినారాయణ, బోదెబోయిన క్రిష్ణ, యెట్టి పాపారావు ,సంజీవ,తొలెమ్ రవి కుమార్, తల్లాడి నానాబాబు పాల్గొన్నారు.

# GENERAL NEWS



## పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన సిపిఐ

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచినందుకు నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, రావి నారాయణ రెడ్డి కాలనీ చౌరస్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ, (CPI) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను తగలబెట్టారు.పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో నినాదాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాది రెడ్డి , ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ అజ్మీరా హరిసింగ్ నాయక్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నరసింహ, బి ఓ సి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు ధూపం నిరంజన్, పొన్నాల యాదగిరి, డవుల రాములు, గోపి, AISF నాయకుడు, వినోద్ నాయక్, మంగళపల్లి రవి, ఎస్.మల్లేష్, బుజ్జ రాజు, రమేష్ నాయక్... మహిళా సమైక్య నాయకురాలు వట్టి నవనీత , చందన, సుజాత, దేవమ్మ, అనసూయ, ప్రియా, అన్నపూర్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఓయూలో ఘనంగా మహిళా దినోత్సవం

**విశాలభారతి, ఓయూ:**

మహిళలు అన్ని రంగాల్లో మరింత గా రాణించాలని ఓయూ సైన్సు కళాశాల ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో డా. అరుణ వెంకట్ అన్నారు. ఉమెన్స్ ఎంపవర్ మెంట్ సెల్ ఓయూ, సైన్స్ కాలేజ్ ముఖ్య అతిథులుగా గైని కాలజిస్ట్ డాక్టర్ అరుణ వెంకట్ హాజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఉద్యోగం, కుటుంబంతో పాటు ఆరోగ్యంపైకూడ శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగినులు, విద్యార్థులు, అద్యాపకులు డ్యాన్సు చేస్తూ ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ మొట్టమొదటి మహిళ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శైలజ, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. ప్రభాకర్, ఉమెన్స్ కమిటీ చైర్ పర్సన్, డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రణీత,వైస్ చైర్ పర్సన్ షర్మిల, ఉమెన్స్ కమిటీ అధ్యక్షురాలు సి. హైమావతి,ప్రధాన కార్యదర్శి స్వాతి రెడ్డి, ట్రెజరర్ సుధ,తో పాటుగా సభ్యులు సుహాసిని, వరలక్ష్మి, అపర్ణ, ప్రీతి, సుధా, సునీత, సురేఖ తోపాటు ఓయూ లో ఉన్న మహిళ ఆఫీసర్స్ ,మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఉల్లాసంగా ఉత్సహం గడిపారు. కార్యక్రమంలో ఓయూ మూడు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు బిమయ్య , రవి, నాగరాజ రావు, విజయ్ కుమార్, శివ శంకర్, అక్బర్ బేగ్ పాల్గొన్నారు.




## మత సామరస్యానికి మారుపేరు ఈద్ మిలాప్

- ఓయూలో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా ఈద్ మిలాఫ్
- ఓయూ వీసీ

**విశాలభారతి, ఓయూ:**

మత సామరస్యనికి మారు పేరు ఈద్ మిలాప్ అని ఓయూ వీసీ ప్రొ. కుమార్ అన్నారు. అయిన బుధవారం ఓయూ మూడు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఓయూ నాన్ టీచింగ్ హోం లో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ నాయక్, డైరెక్టర్ డా.హమీద బీ లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కె.భిమాయ్య,ఎ. రవి, కె.ఎస్.నాగరాజా రావు, ఎస్.విజయ్ కుమార్, టి.శివ కుమార్, అక్బక్ బేగ్, మూడు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.అనంతరం ఉద్యోగులు ఆనవాయితీగా ఏర్పాటు చేసి షేర్ కర్మ ను సేవించారు.

## రూ.4 లక్షల ఎల్ఓసి అందచేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు,విశాలభారతి**

ఆపత్కాల సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన హంసమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు



మంజూరైన 4 లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి నీ ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.





## కేసీఆర్ తెలంగాణను నిలబెడితే..రేవంత్ రెడ్డి పడగొట్టిండు

- కేసీఆర్ ది సాగు భాష.. రేవంత్ రెడ్డిది చావు భాష
- దేవుళ్లనే మోసం చేసిన చరిత్ర రేవంత్ రెడ్డిది
- 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ వరంగల్ సభను విజయవంతం చేయండి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**పటాన్ చెరు,విశాలభారతి**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను నిలబెడితే.. రేవంత్ రెడ్డి పడగొట్టిండని, ప్రగతి పథంలో నడిపిన తెలంగాణను ఆగం చేసిండని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. బుధవారం పటాన్ చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి మొక్కులో భాగంగా, ఆదర్శ్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గం కో ఆర్డినేటర్ గా నియమితులైన సందర్భంగా బీరంగూడ కమాన్ వద్ద ఉన్న తన స్వగృహం నుండి రుద్రారం గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవాలయం వరకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణేష్ గడ్డ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో హరీష్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ ది సాగు భాష అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది చావు భాష అని విమర్శించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ, ఇతర పథకాల విషయంలో దేవుళ్ళతో పాటు ప్రజలను మోసగించాడని మండిపడ్డారు. అన్ని రంగాల్లో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని, రాష్ట్రానికి ఆదాయం తగ్గిందని చెప్పారు. రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తున్నదని అన్నారు. రేవంత్ రెడ్డిది మాటలకు ఎక్కువ చేతులకు తక్కువ పాలన అని ఎద్దేవ చేశారు. రుణమాఫీ అసలు ఇయ్యాల్సింది 49 వేల కోట్లు, అసెంబ్లీలో చెప్పింది 31 వేల కోట్లు, ఇచ్చింది 15, 16 వేల కోట్లు కూడా లేదన్నారు. వానకాలం యాసంగికి ఎగ్గొట్టిన రైతుబంధు డబ్బులు 14,000 కోట్లు రుణమాఫీకి పెట్టిండని అన్నారు. 50% రుణమాఫీ కూడా కాలేదని, రైతుబంధు రాలే, 4000 పెన్షన్ రాలే, అక్క చెల్లెళ్లకు మహాలక్ష్మి పెన్షన్ రాలేదన్నారు. కేసీఆర్ ఎన్నికల హామీ ఇవ్వకపోయినా 13 లక్షల పేదింటి ఆడపిల్లల కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించారని గుర్తు చేశారు. కేసీఆర్ చెట్లు పెడితే రేవంత్ రెడ్డి వాటిని నరుకుతున్నాడని, అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాల భూమి తీసుకొని అక్కడ చెట్లని నరికి, హెచ్ సీయు భూముల్లో 400 ఎకరాల అడవిని నరికి మూగజీవుల పాపం కట్టుకున్నాడనీ మండిపడ్డారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కులగొడుతూ వారి ఉసురు పోసుకుంటున్నాడన్నారు. కెసిఆర్ తెలంగాణను ప్రగతి పథం వైపు నడిపిస్తే.. రేవంత్ రెడ్డి ఆగం చేస్తున్నాడని ఆరోపించారు. మళ్ళీ బీఆర్ఎస్, కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం లభించే బాధ్యత నేను తీసుకుంటా.. కష్టపడే ప్రతి కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుందని తెలిపారు. ఏప్రిల్ 27న నిర్వహించే వరంగల్ సభను విజయవంతం చేయాలని కోరారు. పటాన్ చెరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు అందరూ కలిసి పని చేయాలని మాజీ మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదన చారి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేపల్లి సోమిరెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశం గౌడ్, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బౌద్ధ నగర్‌లో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'పాదయాత్ర

**సికింద్రాబాద్,విశాలభారతి :**

సికింద్రాబాద్ నియోజకవర్గము బౌద్ధ నగర్ డివిజన్ లో కంటేస్టేడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ అదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత హాజరయ్యారు. బాపూజీ, డాక్టర్ అంబేద్కర్, భారత రాజ్యాంగం చిత్రపటాలను చేతిలో పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మహనీయుల గురించి, రాజ్యాంగం గురించి వివరించి వాటి విలువలను తెలిపారు.



## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు రంగారెడ్డి జిల్లా నేతలు ఏర్పుల నరసింహ

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆరు నెలలుగా ఉన్న పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 నుండి నిర్వహించబడే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఈ మేరకు మండల ఎంపీఓ కు బుధవారం సమ్మె నోటీసు అందించారు.

ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని జీవో నెంబర్ 51ను సవరించాలని,మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం 26000 రూపాయలు ఇవ్వాలని రెండవ పీ.ఆర్.సీ ని గ్రామపంచాయతీ కార్మికులకు వర్తింపజేయాలని, వారిని కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈనెల 19 నుండి సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈలోపు ప్రభుత్వం స్పందించి వెంటనే ఆరు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా అధికారులు మారినా పంచాయతీ సిబ్బంది, బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే ప్రభుత్వం దిగివచ్చి గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, అంజయ్య, బాలయ్య, , లక్ష్మయ్య, జ్యోతి, కవిత, బిక్షపతి సుధాకర్ గ్రామపంచా సిబ్బంది పాల్గొన్నారు.



## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

- ఈటెలకి బిజెపి కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు వినతిపత్రం

**కూకట్ పల్లి,విశాలభారతి :**

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా వారి కార్యాలయం వెళ్లి కలిశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్ లలోని ప్రజాసమస్యలు అభివృద్ధి పనుల పై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, మూసాపేట్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, కెపిహెచ్బి కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు జి. రమేష్, పిట్ల మనోహర్,కొత్తూరి రమేష్, డివిజన్ అధ్యక్షులు ఎర్రస్వామి, కిరణ్ కుమార్ మహిళా నాయకులు శివరంజని, శ్రీలత, రూప తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీఏ విభాగంలో గెస్ట్ లెచ్చర్

**విశాలభారతి,ఓయూ:**

ఓయూ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో బుధవారం ఓయూ సెమినార్ హాల్లో టీం బిల్డింగ్ పై గెస్ట్ లెచ్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మూ క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ప్రొ. చంద్రశేఖర్ నాయర్ సమస్యలు పరిష్కరించాలని దానికి గల సామర్థ్యాలను కూడగట్టుకొని ముందుకు సాగాలని, విద్యార్థుల్లో ఇవ్వని ఉండాలని సూచించారు. క్రియోటివిటి, టీం వర్క్ ఉండాలన్నారు. ఎంబీఏ విభాగం హెడ్ ప్రొ. వై.జహంగీర్,ప్లేస్ మెంట్ ఆఫీసర్డా.వి.సమున్నత ,ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొపెసర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
10.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## డా.పరశురాం హౌస్ అరెస్ట్

**జీఓ 21ను రద్దు చేసేంత వరకు ఉద్యమం ఆగదు**

విశాలభారతి, ఓయూ:

బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగులు తలపెట్టిన ఛలో ఉన్నత విద్యామండలి కార్యక్రమంలో భాగంగా ఔట సి రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం ను అయిన నివాసంలో హౌస్ అరెస్ట్ చేసిన అనంతరం నల్లకుంట పోలీసు స్టేషన్ కు తరలించారు. జీఓ 21ను రద్దు చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాల ని అప్పటి వరకు తమ ఉద్యమం ఆగదని చెప్పారు.





## పసుమముల క్రికెట్ ప్రీమియర్ లీగ్5 విజేతకు బహుమతులు

పెద్ద అంబర్ పేట్,విశాలభారతి :

రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పసుమాములలో జరిగిన పసుమాముల క్రికెట్ ప్రీమియర్ లీగ్5 ( 2025) కి సంబంధించి విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. ఇందులో మొత్తం ఐదు జట్లు తెలపడగా జూకంటి పులిందర్ గౌడ్ (జేపీ టైగెర్స్) జట్టు మొదటి బహుమతి ( 50,000+ ట్రోఫీ), కేశి శివలింగం గౌడ్ ( శివసేన) జట్టు ద్వితీయ బహుమతి ( 30000+ ట్రోఫీ) పొందడం జరిగింది,మొదటి బహుమతి 50 వేల రూపాయలను పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ చైర్పర్సన్ పండుగల జయశ్రీరాజు అందించారు, ద్వితీయ బహుమతి 30 వేల రూపాయలు మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ అందించారు. ఈ కార్యక్రమం లో టోర్నమెంట్లో పాల్గొన్న జట్లు కొత్తపెల్లి జైపాల్ రెడ్డి( కేఎన్ఆర్ లయన్స్ ),తలారి ప్రభాకర్ ముదిరాజ్ ( టీఎస్ సూపర్ కింగ్స్),కేశి శివలింగం గౌడ్ (శివసేన),జూకంటి పులిందర్ గౌడ్( జేపీ టైగెర్స్), పాండల సంతోష్ దినేష్ గౌడ్ (వీడియెస్ లెజెండ్స్)లు పాల్గొనడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ మచ్చేందర్, సంతోష్, అజయ్, చరణ్, అన్వేష్, దినేష్, జంగయ్య గౌడ్, మహేష్, వాసు, శేఖర్ తో పాటు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.



## దేశంలోనే సన్నబియ్యం పథకాన్ని కాంగ్రెస్ పార్టీనే ప్రారంభించింది

**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

కూకట్పల్లి విశాల భారతి:

ప్రతి పేదవాడికి ప్రాణమైన ఆహారాన్ని అందించాలని లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రారంభించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేని అని బండి రమేష్ అన్నారు. సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి పేదవాడి ముఖంలో ఆనందం వ్యక్తమవుతోంది అన్నారు.సన్న బియ్యం లబ్ధిదారుడు బాలనగర్ కు చెందిన రవి ముదిరాజ్ ఆహ్వానం మేరకు బుధవారం బండి రమేష్ తో పాటు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు రవి నివాసం లో సన్న బియ్యం భోజనాన్ని చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది అన్నారు.ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, శ్రీకాంత్ పటేల్,శివకుమార్ గౌడ్, మధుసూదన్, లక్ష్మయ్య, శివ చౌదరి,రమణ,తదితరులు పాల్గొన్నారు.



## నూతన సీసీ కెమెరాలు, సీసీ రోడ్డు ప్రారంభోత్సవం

- అతిథులుగాస్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

విశాలభారతి,పెద్ద అంబర్ పేట :

హయత్ నగర్ డివిజన్లోని సూర్య నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన నూతన సీసీ కెమెరాలు మరియు సిసి రోడ్ల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎల్బీ నగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడానికి,దొంగతనాలను, ప్రమాదాలను , వాస్తవ పరిస్థితులను, నూతన టెక్నాలజీ విధానం ద్వారా తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజలందరూ అనుక్షణం నిఘా నీడలో భద్రంగా ఉంటారని, ప్రతి కాలనీలోనూ సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు వాటి మెయింటనెన్స్ కూడా ముఖ్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను , జిల్లా sc మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ , కాలనీ అధ్యక్షులు అనంతల వెంకటేష్ గౌడ్ , సంక్షేమ సంఘ కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శి బొర్ర జైపాల్ రెడ్డి, తంగేళ్ల సంజీవరెడ్డి, గంట శ్రీనివాస రెడ్డి ,మద్ది రాజేందర్ రెడ్డి, చెరుకు శంకరయ్య, అంతటి స్వామి గౌడ్ ,ఏనుగు నరసింహారెడ్డి, మారెడ్డి చంద్రారెడ్డి ,తాళ్లపల్లి విజయ్ కుమార్ తదితరులు కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.







## భారత రాజ్యాంగ పరిరక్షణకై కాంగ్రెస్ పాదయాత్ర

- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్

కూకట్పల్లి, విశాలభారతి:

ఏఐసీసీ పిలుపు మేరకు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కెపిహెచ్బి కాలనీ రోడ్ నెం1లోని గాంధీ విగ్రహం నుండి రమ్య సెంటర్ వరకు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, పట్నం సునీత మహేందర్ రెడ్డి,ఉజ్మా షకీలా పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ తమ ధ్యేయమని రాజ్యాంగ మార్పులు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కాంగ్రెస్ నాయకులు తేల్చి చెప్పారు.మహాత్మా గాంధీని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని అవమానిస్తూ కేంద్ర హోం మంత్రి అమీషా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.మోడీ పాలనలో సామాన్యుడు బతికే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు.రాజ్యాంగ పరిరక్షకులు గా ఉండాల్సిన మోడీ రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఏ బి బ్లాక్ పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు ,కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దండగుల యాదగిరి, పుష్ప రెడ్డి, ప్రతాప్ రెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ సీనియర్ నాయకులు కలికోట శంకర్, కాంగ్రెస్ పార్టీ శీనన్న నాయకురాలు బండి సుధా,కాంగ్రెస్ యూత్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ, సీనియర్ నాయకులు,ఎస్సీ ,బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

## రిలయన్స్ డిజిటల్ భవనంపై నుండి దూకి ఆత్మహత్య

- భార్య చనిపోయిన మరుసటి రోజే భర్త మనస్థాపంతో దూకి ఆత్మహత్య

పెద్ద అంబర్పేట్, విశాలభారతి:



హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి ముదిరాజ్ కాలనీ సంబంధించిన సంపంగి నాగేష్ అనే వ్యక్తి రిలయన్స్ డిజిటల్ భవనం పై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందని ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మంగళవారం రోజు ఉదయం 11:30 సమయంలో ముదిరాజ్ కాలనీకి చెందిన సంపంగి శిరీష భర్త నగేష్ వయస్సు 20 సంవత్సరాలు కలిగిన మహిళ తాను ఉంటున్న ఇంట్లో చీర సహాయంతో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందటం జరిగిందని, శిరీషకి వివాహం జరిగి రెండు సంవత్సరాలు అవుతుందని వీరికి 11 నెల ఒక బాబు ఉన్నాడని శిరీష మరణం పై తన తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు పై కేసు నం. 470/ 2025, యు బై ఎస్ 1904 బి ఎం ఎస్ ఎస్ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని, అనంతరం ఆమె భర్త సంపంగి నాగేష్ ను అదుపులోకి తీసుకొని అదే రోజు అనగా మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు నగేష్ కుటుంబ సభ్యుల షిరిడి పై విడుదల చేయడం జరిగిందని తెలిపారు, కానీ సంపంగి నాగేష్ తండ్రి బాలరాజు వయస్సు 25 సంవత్సరాలు వృత్తిరీత్యా జిహెచ్ఎంసి కార్మికుడు గా పని చేస్తున్నాడని, బుధవారం ఉదయం 5:30 నిమిషాల సమయంలో భార్య మరణం విషయంలో మనస్థాపం చెంది హయత్ నగర్ లోని రిలయన్స్ డిజిటల్ పై నుండి దూకి ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని అన్నారు సంపంగి నరేష్ మరణం పై తన తండ్రి బాలరాజు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## జార్జిరెడ్డి వర్ధంతి సభలను జయప్రదం చేయండి

- పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి.

సూర్యాపేట,విశాలభారతి:

ఉస్మానియా అరుణతార యువమేధావి జార్జి రెడ్డి 53వ వర్ధంతి సభలను జయప్రదం చేయండని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి పిలుపునిచ్చారు. బుధవారం పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ జార్జి రెడ్డి 53వ వర్ధంతి సభలను ఏప్రిల్ 10 నుండి 14 వరకు జయప్రదం చేయాలని గోడ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ జార్జిరెడ్డి స్ఫూర్తితో మతోన్మాద బాబాజాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. కేంద్రంలో మోడీ సర్కార్ విద్య ఆశాకరణ పూర్తిస్థాయిలో అమలు చేస్తూనే విద్య రంగానికి నాటికి దిగజారుస్తుందని,గుజరాత్ రాష్ట్రం సహా కర్ణాటక లోను పాఠ్యాంశాల్లో సనాతన రామాయణం మహాభారతలను చేర్చారని తెలిపారు.మోడీ హిందూ మతతత్వ పాదాలను వాదనలకు సరిపోయేలా చరిత్ర రాజకీయ సామాజిక శాస్త్రాలు విభాగంలో తిరోగమనమైన మార్పులు చేశారన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు మందడి శ్రీధర్, మహేష్, పవన్, నవీన్,వినయ్, సాయి,కిరణ్ లవన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ రూ.905.50

- సామాన్యులకు బండ భారం

ఆమనగల్లు,విశాలభారతి:



వంట గ్యాస్ ధరలు సామాన్యులు నడ్డి విరుస్తున్నాయి. ప్రజలపై మళ్లీ అదనపు భారం పడింది. చమురు కంపెనీలు వంటగ్యాస్ సిలిండర్ ధరను మరో 50 రూపాయలు పెంచేశాయి. 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధర రూ 905.05 కు చేరుకున్నది. కట్టెలపొయ్యి లతో అష్టకష్టాలు పడుతున్న మహిళలకు గతంలో ప్రభుత్వం దీపం వంటి పథకాలు ప్రవేశపెట్టి ఇంటింటికి సబ్సిడీ సిలిండర్లను అందించిన పాలకులు ఇప్పుడు ధరలు పెరుగుతుండటంతో విలవిలలాడుతున్నారు. పేద మధ్య తరగతి కుటుంబాలపై ధరల పెంపు భారంగా మారింది. ధరలను పెంచేస్తూ సామాన్యుల నెత్తిన పిడుగుల గ్యాస్ బండను చేస్తుండగా ప్రభుత్వాలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.సామాన్యులు ,సామాన్య మధ్య తరగతి ప్రజలు, ఇబ్బంది పడకుండా పట్టించుకోని ఈ ప్రభుత్వలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులు సబ్సిడీ నగదు బ్యాంకులో వేసి దానిని కూడా ఎత్తివేసారరని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సామాన్యులపై మరో సర్జికల్ స్ట్రైక్**

**-మాజీ జడ్పిటిసి అనురాధ**

కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముకాయడం కోసం ప్రధాని మోదీ దేశ ప్రజలపై భారం మోపుతున్నారని మాజీ జడ్పిటిసి అనురాధ విమర్శించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో ఇలాంటి పరిస్థితి ఉండటం భాజపా చేతకానితనానికి నిదర్శనమన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు బీజేపీ అధికారంలోకి వచ్చాక దీంతో రవాణా చార్జీలతో పాటు నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యుల పైన సర్జికల్ స్ట్రైక్ చేస్తుందన్నారు.ధరలు పెరిగి సామాన్యులపై గుదిబండ వేస్తుందన్నారు.ఈ యొక్క ధరలు పెంపుదలతో ఇంకా బ్రతుకలేని జీవనం అవుతుందన్నారు.. ఎక్కువగా బడుగు బలహీన వర్గాలు నిరుపేదలు,మధ్యతరగతి పేద ప్రజలపై ఈ ప్రభుత్వం మోయలేని భారాన్ని వేస్తుందని,సామాన్య ప్రజలకు మళ్ళీ కట్టెల పొయ్యిమీదనే దిక్కేయాలఉందన్నారు.ఇప్పటికైనా పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




## గ్రామగ్రామన బీజేపీ బలోపేతం

ఆమనగల్లు,విశాలభారతి:

అమనగల్లు మండల, మున్సిపాలిటీ కేంద్రాల్లోని గ్రామాలలో బుధవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పార్టీ జెండాను ఆవిష్కరించారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీస్తోందని ఆరోపించారు.దేశ ప్రజల భవిష్యత్ కోసం నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చలన్నారు.ఈ కార్యక్రమం లో కల్వకుర్తి నియోజకవర్గ కో కన్వీనర్ గోరటి నర్సింహా, బీజేపీ మండల అధ్యక్షులు ఎర్రవోలు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు లక్ష్మణ్ రావు,జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ కృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# నూతన 650 పడకల భవన నిర్మాణ పనులు త్వరిగతిన పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**సూర్యాపేట,విశాలభారతి:** సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో నిర్మిస్తున్న 650 పడకల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వైద్య అధికారులు, టి ఎస్ ఎమ్ ఐ డి సి ఇంజనీరింగ్ అధికారులతో నూతన భవన నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ నూతన భవన నిర్మాణం ప్లానింగ్ ని పరిశీలించి ఎ అంతస్తులో ఎ డిపార్ట్మెంట్ వస్తుందో అడిగి తెలుసుకొని కొని సూచనలు సూచించి మార్పులు కొరకు టి ఎస్ ఎం ఐ డి సి కి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. డిపార్ట్మెంట్ వారీగా హెచ్ ఓ డి లతో సమీక్ష నిర్వహిస్తూ హాస్పిటల్ కి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. తదుపరి నిర్మాణ పనులు జరుగుతున్న నూతన భవనం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులు లో వేగవంతం పెంచి త్వరగా పూర్తి చేసి ప్రజలకి వైద్య సేవల కొరకు అందుబాటులకి తీసుకొనిరావాలని ఇంజనీరింగ్ అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిటీడెంట్ డాక్టర్ సత్యనారాయణ, టి ఎస్ ఎం డి సి సి ఈ దేవేందర్, ఈ ఈ జైపాల్ రెడ్డి, హెచ్ ఓడిలు, ఎఈలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందజేత



**బాల్కొండ, విశాలభారతి:** మోర్తాడ్ మండలం ధర్మోర గ్రామానికి చెందిన పత్రి సంయుక్త ఇటీవలే జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స కొరకు హైదారాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో చేరారు. తలకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు.ఆపరేషన్ కు ప్రభుత్వం తరుపున సహాయం కొరకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ని అభ్యర్థించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2లక్షల 50వేల ఎల్ఓసిని మంజూరు చేయించి అందజేశారు.ఆపద సమయంలో ఆదుకున్న ముత్యాల సునీల్ కుమార్ కి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలలో నాణ్యమైన ధాన్యం విక్రయించి రైతులు బోనస్ పొందాలి

- కొనుగోలు కేంద్రాలలో మౌళిక వసతులు ఏర్పాటు చేయాలి.
- జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు



**సూర్యాపేట,విశాలభారతి:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తేమ శాతం17 ఉండేలా తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకొనివచ్చి మద్దతు ధర రూ. 2320 పై భోనస్ రూ. 300 పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. బుధవారం సూర్యాపేట మండలం పరిధిలోని పిల్లలమర్రి, రాజ్ నాయక్ తండా, బాలేంల1 ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, టెంట్ లాంటి మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని, గోనె సంచులు తెచ్చుకోవాలని నిర్వాహకులకి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకి వచ్చిన ప్రకారం రైతులకి టోకెన్ లు జారీ చేయాలని వడ్లలో తాలు లేకుండా ఆరబెట్టించి తేమ శాతం 17 రాగానే తూకం వేసి ధాన్యం మిల్లులకి తరలించాలని సూచించారు.రాజ్ నాయక్ తండా కొనుగోలు కేంద్రంలో వడ్లను ఆరబెట్టేందుకు ట్రాక్టర్ ని ఉపయోగిస్తున్నందంగా అదనపు కలెక్టర్ చూసి అలా ట్రాక్టర్ ఉపయోగిస్తే వడ్లు విరిగి బియ్యం, నూకగా మారుతాయని అలా చేయరాదని నిర్వాహకులని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వం సూచించిన ప్రాంతాలలో మాత్రమే కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని, వాటికి ఉప కేంద్రాలు ఏర్పాటు చేయరాదని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ గోపి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వెంకటమ్మ, నాగరాజు, బాలాజీ, దేవి తదితరులు పాల్గొన్నారు.



## ఓయూ చరిత్ర విభాగం పరిశోధకుడు
# వట్టికూటి సందీప్‌కు డాక్టరేట్



**సూర్యాపేట,విశాలభారతి:** ఉస్మానియా యూనిర్సిటీ చరిత్ర విభాగం పరిశోధకుడు వట్టికూటి సందీప్ డాక్టరేట్ సాధించారు. చరిత్ర విభాగం ఆచార్యులు అడపా సత్యనారాయణ పర్యవేక్షణలో సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలంలోని గాజుల మల్కాపురం గ్రామానికి చెందిన వట్టికూటి సందీప్ మట్టిబిడ్డకు ఉస్మానియా యూనివర్సిటీలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం పట్ల వారి తల్లిదండ్రులు, స్నేహితులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గాజుల మల్కాపురం గ్రామానికి చెందిన వట్టికూటి రాములు, తిరుమలమ్మ దంపతుల చిన్న కుమారుడు సందీప్ చిన్నతనం నుండి కష్టపడుతూ డిగ్రీ వరకు సూర్యాపేటలో చదువుకొని పీజీని కేయూ క్యాంపస్ లో పూర్తి చేసి ఓయూలో చేరి పీహెచ్డీ ప్రవేశం పొంది తెలంగాణ ఉద్యమంలో దళిత బహుజనుల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ ఆడప సత్యనారాయణ పర్యవేక్షణ లో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా చరిత్ర విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ ఇందిరా, ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ జరీనా పర్వీన్, డాక్టర్ పి. రమేష్ డాక్టరేట్ అందుకోవడం పట్ల సందీప్ ను అభినందించారు. బీదరికంలో జన్మించిన కూడా పట్టుదలతో కష్టపడి చదువుకొని డాక్టరేట్ పొందడం పట్ల సంతోషంగా ఉందని సందీప్ తెలిపారు.



## ఇద్దరికి ఎల్ఓసిను అందజేసిన
# మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం షేట్పల్లి గ్రామానికి చెందిన బబ్బూరి నడిపి లింబన్న ఇటీవల యాక్సిడెంట్ కి గురై రెండు కాళ్ళు కోల్పోవడం జరిగింది.నిమ్స్ లో కృత్రిమ కాలు ఏర్పాటు సర్జరీ కోసం రూ.1లక్ష ఎల్ఓసి,అలాగే ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన కల్లెడ దినేష్ అతి చిన్న వయస్సులో బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చేరడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స కొరకు రూ. 1లక్ష 50 వేల ఎల్ఓసి ఎమ్మెల్యే వేముల మంజూరు చేయించారు.ఎల్ఓసి కాపీలను సంబంధిత ఇద్దరు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వేల్పూర్ లో అందజేశారు.చికిత్స కొరకు ఎల్ఓసిలను ఎమ్మెల్యే మంజూరు చేయడంతో ప్రశాంత్ రెడ్డి మేలు మర్చిపోలేమని,జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా తెలియజేశారు.



## చింత నవీన్ ఆధ్వర్యంలో
# ఎన్ఎస్ యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్యాపేట,విశాలభారతి:** జిల్లా కేంద్రంలోని బాలుర వసతి గృహంలో నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా 55వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా సూర్యాపేట నియోజకవర్గం అధ్యక్షులు బంధం విష్ణు నాని ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అరటి పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎన్ఎస్ యుఐ పోరాడుతుందని తెలిపారు. ఎన్ఎస్ యు ఐ ని బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షుడు చింత నవీన్, చివ్వెంల మండల అధ్యక్షుడు దేవరకొండ సాయి కృష్ణ మామిడి మహేందర్,ప్రభాకర్, సాయి సందీప్,అజయ్,శివ,మహేష్, రాజేష్,వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# జై బాపు,జై భీమ్,జై సంవిదాన్ పాదయాత్ర కార్యక్రమం

**బాల్కొండ,విశాలభారతి:** ఏఐసీసీ,పీసీసీ ఆదేశాల మేరకు భీమ్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొదిరే స్వామి ఆధ్వర్యంలో మెండోరా, బాబాపూర్,కుప్కల్, జాగిర్యాల్,సుదర్శన్ నగర్ తండా,సంతోష్ నగర్ తండా గ్రామంలో జై బాపు,జై భీమ్,జై సంవిదాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బొదిరే స్వామి,డిసిసి ప్రధాన కార్యదర్శి కుంట రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం,మహనీయులైన మహాత్మా గాంధీ,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని వారి ప్రయత్నాలను తిప్పి కొట్టడానికి భారత కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల కోసం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నారని,గృహజ్యోతి ,ఉచిత సిలిండర్,ఫ్రీ బస్సు,వడ్డీ లేని రుణాలు,రైతులకు రైతు రుణమాఫీ,రైతు భరోసా, సన్నబడ్లకు బోనస్,రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం ఇలా పథకాలను ప్రజలకు అందించి బడుగు బలహీన వర్గాల కళ్ళలో ఆనందాన్ని నిపుతున్నారని అన్నారు.రాబోయే రోజుల్లో మహిళలు రైతులు ప్రజలంతా కూడా సిఎం రేవంత్ రెడ్డి వెంట ఉండి ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మార్కెట్ డైరెక్టర్ కిష్టి చిన్న బాబాన్న,పట్టణ అధ్యక్షుడు జె.జె నర్సయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కోరాడి రాజు,ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనంత్ రావు,ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భోజ గౌడ్,యువజన కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగేంద్రబాబు, బాల్కొండ నియోజకవర్గ యువజన అధ్యక్షులు చరణ్ గౌడ్,మండల యువజన అధ్యక్షుడు అవినాష్, మండల మహిళా అధ్యక్షురాలు కల్పన,నాయకులు కన్నె సురేందర్,మల్లెల లక్ష్మణ్,రాజేష్, మురళి,గంగబాపు,గోవర్ధన్,దైడి సురేష్,పల్లె శేఖర్,లింబాద్రి, రమేష్,కిసాన్,మిరాజ్,కలీం,రాగుల మోహన్,పిట్ల శీను,సురేష్, సాగర్,తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుంది

- కోతులనడుమ గ్రామంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం
- యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల చైతన్య

**విశాలభారతి,ఎల్కతుర్తి:** మండలంలోని కోతుల నడుమ గ్రామంలో జై బాపు జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల చైతన్య యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి హుస్నాబాద్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ మహాత్మ గాంధీ వారసత్వాన్ని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానపరచడం అంటే యావత్ మన దేశాన్ని అవమానపరిచినట్లే అన్నారు. బీజేపీ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాసౌమ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందాన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను మన రాజ్యాంగాన్ని అవమానించే బిజెపి, దాని అనుబంధ సంస్థలు దాడులు చేస్తున్నాయని గుర్తు చేశారు. దాడులను క్షేత్రస్థాయి నుంచి తిప్పి కొట్టాలని భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేద్కర్ను గౌరవించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎనిమినేటి కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనా రెడ్డి పీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు సంతాజి యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ మండ సుమన్ గౌడ్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ ఎల్తూరి రత్నాకర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్రోళ్ల శ్రావణ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీపతి మొగిలి పల్లెబోయిన రాజ్ ఎర్రోళ్ల సురేష్ బోయినపల్లి బాపూరావు ఎర్రళ్ల చిరంజీవి మంద మల్లికార్జున్ రాజేష్ ఎర్రోళ్ల యూత్ నాయకులు పల్లె రాకేష్ గౌడ్ వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్
# ధరలను వెంటనే తగ్గించాలి

**మునుగోడు,విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం గ్యాస్ పై రూ.50, డీజిల్, పెట్రోల్ పై రూ.2 పెంచడాన్ని నిరసిస్తూ బుధవారం సిపిఐ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిలర్ సభ్యుడు సరిగి చలపతి మండల కార్యదర్శి చాపల శీను మాట్లాడుతూ దేశంలోని పేద మధ్య తరగతి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మోపుతున్న ఆర్థిక భారం మరింత పెరుగుతుందోని ఆవేదన వ్యక్తం చేశారు .గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు కార్పొరేట్ కంపెనీలకు భారీ రాయితీలను అందిస్తూ ,సం పన్నులకు మద్దతుగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు . జీఎస్టీ పేరుతో పన్నుల భారం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న వేళ గ్యాస్ ధరను పెంచడం ఆమానుషమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మందుల పాండు, మండల కార్యవర్గ సభ్యులు దుబ్బ వెంకన్న ,పట్టణ కార్యదర్శి కురుమర్తి ముత్తయ్య ,బండారు శంకర్ ,ఏఐటీయూసీ మండల కార్యదర్శి బెల్లం శివయ్య ,బీసీ సంఘం మండల అధ్యక్షులు ఈదులకంటి కైలాస్, మండల కార్యవర్గ సభ్యులు కాగిత వెంకన్న , దుబ్బ ప్రమోద్ ,కొంపల్లి రాములు కాసిం, చందపాక యాదయ్య, శిరగోని మారయ్య ,మందుల వెంకన్న , పాలకూరి యాదయ్య, ప్రేమలత ,అండాలు ,బక్కమ్మ.పూల రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



# కీర్తి లీగ్ లోనే ఉంది..



మహానటిగా సినీ ప్రియుల మన్నలను పొందిన కీర్తి సురేష్ నటిగా తనని తాను ప్రూవ్ చేసుకుంటూ వచ్చింది. ఎలాంటి ఛాలెంజింగ్ రోల్ అయినా కూడా తన దాకా వస్తే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి అదరగొట్టేస్తుంది అమ్మడు. ఐతే పెళ్లి తర్వాత ఎవరికైనా అవకాశాలు కాస్త సన్నగిల్లుతాయన్న పరిస్థితి ఉంటుంది. ఐతే కీర్తి సురేష్ విషయంలో కూడా అలాంటిది ఉంటుందని అనుకున్నారు. కానీ ఆమెకు వస్తున్న ఆఫర్లు చూస్తే అది నిజం కాదన్నదని అర్థమవుతుంది. ముఖ్యంగా పెళ్లైన కీర్తి సురేష్ ఒక ఆరు నెలలుగా ఎలాంటి కొత్త సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆ టైం లో కీర్తి పని అయిపోయిందని అనుకున్నారు అందరు. కానీ వరుసగా ఆమె సైన్ చేసిన సినిమాల గురించి బయటకు వస్తున్న న్యూస్ లు చూసి అందరు షాక్ అవుతున్నారు. కీర్తి సురేష్ తెలుగులో రెండు భారీ సినిమాలకు సైన్ చేసిందని తెలుస్తుంది. కీర్తి ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి జత కడుతున్నట్టు టాక్. విజయ్ దేవరకొండతో రవికిరణ్ కోలా డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో కీర్తి లక్కీ ఆఫర్ అందుకుంది. ఈ సినిమాలో ముందు సప్త సాగరాలు దాటి హీరోయిన్ రుక్మిణి వసంత్ ని తీసుకోవాలని అనుకున్నారట. ఆ సినిమా కన్నడలో హిట్టైనా తెలుగులో ఆమెకు సూపర్ ఫ్యాన్స్ ఏర్పడ్డారు. ఈ క్రమంలో రుక్మిణికి రౌడీ హీరో సినిమా ఛాన్స్ వస్తుందని అనుకున్నారు. కానీ ఇప్పుడు రుక్మిణి కాదు ఆ అవకాశం కీర్తి సురేష్ కే ఇచ్చారని తెలుస్తుంది. ఇదే కాదు కీర్తి సురేష్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ వచ్చింది. బలగం సినిమా చేసిన వేణు యెల్దండి నెక్స్ట్ చేయబోతున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ ఆఫర్ పట్టేసిందట. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా వెయిట్ ఉంటుందని తెలుస్తుంది. తప్పకుండా ఈ సినిమాలతో అమ్మడు అదరగొట్టబోతుందని టాక్. ఇవే కాదు స్టార్ లీగ్ లో తాను ఉన్నానని అనేలా అమ్మడు ప్రూవ్ చేసుకుంటుంది. తమిళ్ లో మొన్నటిదాకా సినిమాలు చేసిన కీర్తి సురేష్ తెలుగులో చివరగా భోళా శంకర్ సినిమా చేసింది. దసరాలో వెన్నెల పాత్రలో ఇంప్రెస్ చేసిన కీర్తి భోళా శంకర్ తో నిరాశపరచింది. ఇక ఆ తర్వాత నెక్స్ట్ సినిమాలతో మరోసారి ఆకట్టుకోబోతుంది.

# శ్రీలీల డబుల్ గేమ్



తెలుగు హీరోయిన్ శ్రీలీల చెప్పకోవడానికి చాలా తెలుగు సినిమాలు చేసింది. కానీ నటిగా మాత్రం తన స్పెషాల్టీ మాత్రం ఇంతవరకూ ఏ సినిమాలోనూ హైలైట్ అవ్వలేదు. కొన్ని సినిమాల్లో సెకెండ్ లీడ్ కు పరిమితమవ్వడం..మరికొన్ని సినిమాల్లో పూర్తి స్థాయిలో నటనకు ఆస్కారం లేకపోవడంతో? శ్రీలీల రేసులో వెనుకబడింది అనడంలో వాస్తవం ఉంది. దీంతో చెప్పకోవడానికి భారీ హిట్లు అంటూ లేవు.అలాగే నటన పరంగా సంథింగ్ స్పెషల్ గానూ శ్రీలీల ఏ సినిమాలోనూ హైలైట్ అవ్వలేదు. పైగా ఇటీవల రిలీజ్ అయిన `రాబిన్ హుడ్` కూడా ఆశించిన ఫలితాన్నివ్వలేదు. హిట్ అయితే కెరీర్ పరంగా ఎంతో కొంత కలిసొచ్చేది. దీంతో శ్రీలీల గ్రాఫ్ భారీగా డౌన్ అవుతున్నట్లు కనిపిస్తుంది.

ప్రస్తుతానికి తెలుగులో రెండు అవకాశాలు చేతిలో ఉన్నాయి అందులో ఒకటి రవితేజ సరసన `మాస్ జాతర`లో నటిస్తోంది. అలాగే అఖిల్ హీరోగా నటిస్తోన్న `లెనిన్` చిత్రంలోనూ నటిస్తోంది. శ్రీలీలకు ఈ రెండు మంచి అవకాశాలే. ఆ రెండు శ్రీలీల నటనకు ఆస్కారం పాత్రలై ఉండాలి.ఈ రెండు సినిమాలు శ్రీలీల కెరీర్ కి అత్యంత కీలకమైనవి. హిట్ అయితే ఛాన్సుల రేసులో కనిపిస్తుంది. లేదంటే? కష్టమే అన్న చర్చ సాగుతుంది. అయితే లక్కీగా బాలీవుడ్ లో కూడా అవకాశాలు రావడం అన్నది శ్రీలీలకు అతి పెద్ద ఊరట లాంటింది. టాలీవుడ్ లో ఫెయిలైనా బాలీవుడ్ లో చూసుకుందాం? అన్న ధీమా శ్రీలీలలో కనిపిస్తోంది. ఆ కారణంగానే తెలుగు సినిమాలపై ఫోకస్ చేయలేదా? అన్న సందేహం కూడా వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ కి జోడీగా ఓ సినిమా చేస్తోంది. మరో బిగ్ ప్రొడక్షన్ హౌస్ లోనూ కొత్త సినిమాకు సైన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రెండు సక్సస్ అయితే శ్రీలీల చలాకీతనంతో బాలీవుడ్ కి కనెక్ట్ అయ్యే అవకాశాలు ఎక్కుగా ఉన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.